తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## కార్మికులను తరలిస్తున్న వ్యాను బోల్తా

### -15 మందికి గాయాలు, ఒకరి పరిస్థితి విషమం



సత్యవేడు, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త : శ్రీసిటీలోని అల్యూమినియం పరిశ్రమకు కార్మికులను తరలిస్తున్న వ్యాను మంగళవారం ఉదయం మండలంలోని ఈస్ట్ మల్లవారిపాళ్యెం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 15 మందికి గాయాలు కాగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తుంది. నాగలాపురం మండలంలోని టీపి పాళెం నుంచి ప్రతిరోజూ పరిశ్రమకు కార్మికులను తరలించే ఈ వాహనం ఓవర్ లోడ్ కారణంగా, డ్రైవర్ నిద్రమత్తులో వాహనాన్ని అదుపుచేయలేక ప్రమాదానికి గురిచేసినట్లు సమాచారం. ఈఘటనపై కేసు నమోదు చేసిన శ్రీసిటీ పోలీసులు, ధర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



# వేంకటనాధుడి వేడుక !

### తిరుమలలో మొదలైన బ్రహ్మోత్సవ సరంభం







ప్రభాతవార్తప్రతినిధి–తిరుమల:

ఏడుకొండల శ్రీవేంకటేశ్వరుని సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగవైభవంగా ఆరంభమయ్యాయి. ఈ బ్రహ్మోత్సవాలు సోమవారం రాత్రి పెద్దశేషవాహనంతో తొలివాహనం ఊరేగగా, రెండవరోజు మంగళవారంఉదయం సాక్షాత్తు శ్రీమహావిష్ణువు ద్వారకకృష్ణుడు అలంకారంలో ఐదుతలల చిన్నశేషునిపై విహరించారు. తొమ్మిది రోజులుపాటు జరిగే వివిధ రకాల వాహనసేవల్లో దేశం నలుమూలల నుండి వచ్చిన కళాకారులు తమకు తోచిన కళా నృత్యప్రదర్శనలు అద్భుతంగా ప్రదర్శిస్తున్నారు. స్వామివారి చెంత మేమూ సేవకులమేనంటూ ఆనందపరవశులవు తున్నారు. చిన్నశేషవాహనసేవలో వాహనం ముం దు భక్తులను ఆకట్టుకునేలా ప్రదర్శనలిచ్చారు.

### సరస్వతీదేవి అలంకారంలో శ్రీవారు

తిరుమల,సెప్టెంబర్19 ప్రభాతవార్తప్రతినిధి:

చేతిలో వీణాఫాణి ధరించి సరస్వతీదేవి అలంకారంలో శ్రీవేంకటేశ్వరుడు భక్తులకు దర్శనమిచ్చాడు. మంగళవారం రాత్రి 7గంటలకు హంసవాహనసేవ భక్తుల గోవిందనామస్మరణల మధ్య సాగింది. మానససరోవరంలో హంసలు విహ రిస్తాయి. పరమాత్మ యోగిపుంగవుల మనస్సరస్సులలో విహరిస్తారు. హంస స్వరూపుడైన దేవుడు వీణాపాణిగా తిరువీధులలో విహరిస్తూ భక్తులనుకటాక్షించారు. వాహనం ముందు గజరాజులు, అశ్వాలు ఠీవిగా నడుస్తుండగా చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తించారు. వాహనసేవలో టి టిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి దంపతులు, ఇఒ ఏవి ధర్మారెడ్డి దంపతులు, జెఇఒ సదాభార్గవి, వీర బ్రహ్మం, ఆలయ డిప్యూటీఇఒ లోకనాథం, ప్రధాన అర్చకులు వేణుగోపాలదీక్షితులు,సివిఎస్ఒ నరసింహకిశోర్ పాల్గొన్నారు.

## సంప్రదాయ దుస్తుల్లో... నుదుటిన తిలకం ధరించి

### గోవిందుని దర్శించుకున్న సిఎం జగన్



తిరుమల, సెప్టెంబర్ 19 ప్రభాతవార్తప్రతినిధి:

రాష్ట్రముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మంగళ వారం ఉదయం సంప్రదాయ దుస్తుల్లో నుదుటిన తిలకం ధరించి భక్తితో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. తిరుమలేశుని సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలలో రెండవరోజు ఉదయం సిఎం ఆలయ మహద్వారం వద్దకు చేరుకున్నారు. ఇక్కడ ఆయనకు టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఇఒ ఏవి ధర్మారెడ్డి,ఆలయ అర్చకులు వేదమంత్రాలు, మంగళవాయిద్యాలతో ఇస్తికఫాల్‌తో స్వాగతం పలికారు. వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. కాగా సోమవారం రాత్రి ముఖ్యమంత్రి హోదాలో ఐదవసారి వెంకన్నకు పట్టువస్త్రాలు భక్తితో సమర్పించారు.

## శ్రీనివాస సేతు ఫ్లైఓవర్‌ను ప్రారంభించిన సిఎం



శ్రీనివాస సేతు ఫ్లై ఓవర్‌ను ప్రారంభిస్తున్న సిఎం జగన్మోహన్ రెడ్డి

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త

దేవుని దయతో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభోత్సవం చేసుకుంటున్నామని సిఎం జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. సిఎం చేతులు మీదు సోమవారం శ్రీనివాస సేతు ఫ్లై ఓవర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ శ్రీనివాస సేతు ప్రాజెక్టుకు సంబంధించి అందరికీ తెలుసని 2019లో అప్పట్లో ఎన్నికల నిమిత్తం టెంకాయ కొట్టి, జీవో ఇచ్చి వదిలేసిన పరిస్థితుల నుంచి ఈ నాలుగేళ్లలో ఆ ప్రాజెక్టును చేయిపట్టుకుని నడిపించి, దాన్ని పూర్తి చేసి తిరుపతి ప్రజలకు అంకితం చేస్తున్నామన్నారు. దాదాపు 650 కోట్ల రూపాయిలు వ్యయంతో నిర్మించిన 7 కిలో మీటర్ల ఈ ప్రాజెక్టు వల్ల భక్తులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. శ్రీ వెంకటేశ్వర ఆర్ట్స్ కాలేజీ హాస్టల్స్‌కు సంబంధించి రూ. 37.80 కోట్ల వ్యయంతో నూతన భవనాలు నిర్మించి ఇవాళ వాటిని కూడా ప్రారంభించుకుంటున్నామన్నారు. దీని వల్ల అక్కడున్న పిల్లలకు మరింత మెరుగైన వసతి అందుబాటులోకి రానుందన్నారు. అదే విధంగా తిరుమలలో డోనర్స్‌తో ఏడు కోట్ల రూపాయిలతో వకుళమాత నిలయం, రూ. 11.50 కోట్లతో రచన విశ్రాంతి గృహాలను కట్టించి వాటిని కూడా ఇవాళ ప్రారంభోత్సవం చేసి తిరుమల తిరుపతి దేవస్థానానికి ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఎక్సైజ్, జిల్లా ఇన్చార్జి మంత్రికే నారాయణ స్వామి, రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాష్ట్ర క్రీడా సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి ఆర్కె రోజా, ఎంపిలు మద్దిల గురుమూర్తి, ఎమ్మెల్సీలు సిపాయి సుబ్రమణ్యం, కళ్యాణ చక్రవర్తి, తిరుపతి జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి, ఎస్పి పరమేశ్వర రెడ్డి, నగర పాలక సంస్థ మేయర్ శిరీష, ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూధన్ రెడ్డి, తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి, తిరుపతి మున్సిపల్ కమిషనర్ హరిత, టిటిడి జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, ఛీఫ్ ఇంజినీర్ నాగేశ్వర రావు, జిల్లా, టిటిడి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### చంద్రబాబు విడుదల కావాలని

## ఢిల్లీలో టిడిపి ఎంపిల నిరసన

### -అంబేద్కర్ రాజ్యాంగం కావాలి...గూండాల రాజ్యం వద్దు

తిరుపతి,సెప్టెంబర్ 19ప్రభాతవార్త:



టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును వైసిపి ప్రభుత్వం అక్రమంగా కుట్రతో అరెస్టుచేసి జైలుకు పంపిందని, దీన్ని నిరసిస్తూ ఢిల్లీలో టిడిపి ఎంపిలు మంగళవారం నిరసన తెలిపారు. రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం కావాలని, రాజా రెడ్డి రాజ్యాంగం వద్దని, గూండాల రాజ్యం నశించాలని నినా దాలు చేశారు. మాకు న్యాయం కావాలి.....సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ ఎంపిలు గల్లా జయదేవ్, రామ్మోహన్ నాయుడు, కిమిడి కళా వెంకట్రావు, కేశినేని నాని ,మాజీ మంత్రులు అయ్యన్నపాత్రుడు, గంటా శ్రీనివాసరావు, కాల్వ శ్రీని వాసులు, మురళీమోహన్, కంభంపాటి రామ్మోహన్‌రావు, తదితరులు గాంధీ ఘాట్ వద్ద నిరసన తెలిపారు. చంద్రబాబును వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## ఆస్తి తగాదాల నేపథ్యంలో హత్య

### - చిన్నాన్న చేతిలో కొడుకు హతం !!



హత్యకు గురైన రమేష్

కుప్పంరూరల్, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త

ఆస్తితగాదాల నేపథ్యంలో సొంత చినాన్న చేతిలో కొడుకు హతమైన సంఘటన కుప్పం మండలం కొటాలూరు పంచాయతీ బలరాంకొటాలు గ్రామంలో చోటు చేసుకుంది. ఈసంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా.. బలరాం కొటాలుకు చెందిన రాజా, లక్ష్మణ్‌లు అన్నదమ్ములు. కాగా వీరికి గతకొంతకాలంగా ఆస్తితగాదాలు ఉండేవి. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం రాజ కుమారుడు రమేష్ (38) ఇంటి సమీపంలో ఉండగా సొంత చిన్నాన్న అయిన లక్ష్మణ్ (50) రమేష్‌ను కత్తితో నరికి చంపిపరారయ్యాడని తెలిపారు. ఈమేరకు మృతదేహాన్ని పంచనామాకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఆకట్టుకున్న గణనాథుని విగ్రహాలు








శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో ఓటేరు కాలువ వీధిలో ఏర్పాటుచేసిన చంద్రయాన్-3 గణపతి, వెంకటగిరి పట్టణం శివాలయం వద్ద ఏర్పాటు చేసిన నెమలి ఈకలతో తయారు చేసిన వినాయకుడు, పుత్తూరు పట్టణం జెండామాను వీధిలో ఏర్పాటుచేసిన ఊయల్లో ఊగుతున్న వినాయక స్వామి

## 20 నుంచి 23 వరకు మొబైల్ ఆధార్ క్యాంపులు

### జిల్లా కలెక్టర్ వెంకటరమణా రెడ్డి

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త

ఈ నెల 20వ తేది నుంచి 23వ తేది వరకు జిల్లాలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీల్లో మొబైల్ ఆధార్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆధార్ క్యాంపులో నూతనంగా ఆధార్ కార్డు నమోదు, 5 సంవత్సరాలు, 15 సంవత్సరాలు దాటిన బాల బాలికలకు తప్పనిసరి బయోమెట్రిక్ అప్డేట్ సేవలు పూర్తి ఉచితంగా పొందవచ్చున్నారు. ఆధార్ కార్డు ప్రింట్ కొరకు రూ. 30, ఇంటి చిరునామా మార్పు కొరకు రూ. 50, ఇంటి చిరునామాతో పాటు బయోమెట్రిక్ అప్డేట్ కొరకు రూ. 100 రుసుము చెల్లించాల్సి ఉంటుందని, మరీ ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 2010 నుండి 2016 సంవత్సరాల మధ్య ఆధార్ నమోదు చేసుకుని తర్వాత ఒక్క సారి కూడా అప్డేట్ చేసుకుని వారు ఏదైనా రుజువు సమర్పించి తమ ఆధార్ కార్డును అప్డేట్ చేసుకోవాలని తెలిపారు. దీని కొరకు రూ. 50 రుసుము చెల్లించాల్సివుంటుందని తెలిపారు. అందువల్ల తిరుపతి జిల్లాలోని ప్రజలందరూ ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కలెక్టర్ కోరారు.

## షణ్ముఖునికి షోడషోభికాషాలు

### కిట కిటలాడిన సుబ్రమణ్యస్వామి ఆలయాలు



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 19 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో అధ్యాత్మిక చింతన వెల్లి విరుస్తుంది.ధార్మిక దివ్యక్షేత్రంలో ప్రతి రోజూ ధార్మిక కార్యక్రమాలతో తులతూగుతుంది.స్థానిక భక్తులే కాకుండా దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు కూడా ఆధ్యాత్మిక చింతతనలో తన్మయత్వం పొందుతున్నారు. మంగళవారం శ్రీకాళహస్తీశ్వరాలంలో వెలసిన చెంగల్వరాయస్వామి,తేరువీధిలో వెలసిన షణ్ముఖ స్వామి ఆలయాలు భక్తులతో కిట కిట లాడాయి. ఇసుకేస్తే రాలనంత రద్దీ చోటు చేసుకుంది,స్వామి వారికి షోడషాభిషేకాలు నిర్వహించారు. పట్టణానికి ఓ వైపు దుర్గంబా కొండ మరో వైపు సుబ్రమణ్యం స్వామి ఆలయం కుమారస్వామి తిప్పగా వెలసి భక్తుల కొంగు బంగారంగా విరాలజిల్లుతుంది. మంగళవారం పట్టణంలోని సుబ్రమణ్యం స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి.ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి పట్టణంలోని తేరువీధిలో వెలసిన షణ్ముఖ స్వామి ఆలయం అలాగే శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న కుమారస్వామి కొండపై వెలసిన సుబ్రమణ్యం స్వామి ఆలయం, శ్రీకాళహస్తీశ్వరాలయంలో రంగుల గోపురం పక్కన వెలసిన స్వామి,ఆలయంలోని చెంగల్వరాయస్వామి ఆలయంలో విశేషాభిషేకాలు నిర్వహించారు. ముఖ్యంగా తేరువీధిలో వెలసిన 'షణ్ముఖ స్వామి' ఆలయంలో స్వామికి షోడషాభిషేకాలు నిర్వహించారు. వందలాది లీటర్ల పాలు, పెరుగు,తేనే,విభూది, గంధం, కుంకుమ, పసుపు,సకల సుగంధ ద్రవ్యాలతో పూజలు అభిషేకాలు నిర్వహించారు. చూపరులను ఇట్టు ఆకట్టుకునే రీతిలో అర్చకులు ప్రసాద్,మురళిలు తీర్చి దిద్దుతున్నారు.



## హంస వాహనంపై అలరించిన విఘ్ననాధుడు

కాణిపాకం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి ఉభయదేవేరులతో కలసి గణనాధునికి హంసవాహనం సేవను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో మంగళవారం ఉదయం ధ్వజారోహణం కార్యక్రమం జరుగగా రాత్రి స్వామివారికి హంసవాహన సేవను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి కాణిపాకం, అగరంపల్లె, కారకాంపల్లె, వడ్రాంపల్లె, తిరువణంపల్లె గ్రామాదుల శీర్‌కరుణీకర్ వంశస్థులు ఉభయదాతలుగా వ్యవహరించారు. వీరు ఉదయం వరుస ఉభయం తీసుకురాగా అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. అలాగే రాత్రి స్వామి అమ్మవార్ల ఉత్సమూర్తులను అలంకార మండపంలో వుంచి అలంకరించి వేదపండితుల మంత్రోచ్చరణ నడుమ ప్రత్యేకపూజలతో ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. వివిధరకాల పరిమళ పుష్పాలతో అలంకరించిన హంసవాహనంపై స్వామి అమ్మవార్లను వుంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు, ఈఈ వెంకట నారాయణ, ఏఈఓలు ఎస్వీ,కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, రవీంద్రబాబు, హేమమాలిని, హరిమాధవరెడ్డి, సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాబు, సురేష్, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఎంపీటీసీ సుధీర్‌లతో పాటు ఆలయ అధికారులు పాల్గొన్నారు..



బంగారు ధ్వజస్థంభానికి హారతులిస్తున్న అర్చకులు

## అత్తెసరు ధరలతో టమోటా



పుంగనూరు,సెప్టెంబరు 19 ప్రభాతవార్త :

మొన్నటి వరకు ఆకాశంలో ఎగిరేపళ్లెంగా అవతారమెత్తిన టమోటా ఇపుడు అత్తెసరు ధరలతో ఉనికిలో ఊగుతోంది. టమోటా పంట దిగుబడికి జిల్లాలో పడమటి మండలాలది ప్రముఖ పాత్ర. ఈక్రమంలోనే పుంగనూరు, మదనపల్లి, తంబళ్ళపల్లి, సోమల, సదుం ప్రాంతాలలో సాంప్రదాయ పంటగా ఇక్కడి రైతులు సంవత్సరం పొడవునా టమోటా పండిస్తూనే ఉంటారు. ఎందుకంటే ఒక్కోసారి టమోటా పంటకు వచ్చే డిమాండ్‌తోనే రైతులు సాధారణ స్థాయి నుంచి కోటీశ్వరుల వరకు ఎదిగిన సందర్భాలున్నాయి. అయితే,కరోనా కాలం నుంచి మొన్నటి వరకు టమోటా పంటలు వేసి,వేసి లక్షల్లో నష్టపోయిన రైతులు ఈప్రాంతంలో వేలల్లో ఉన్నారు. అయితే,గత మూడునెలల క్రితం వరకు ఏకబిగిన పెరిగిపోయిన ధరలతో కిలో వందరూపాయల వరకు పెరిగి టమోటా అందని పండుగా మారిపోయింది. జూన్‌లో పంట దిగుబడి కోసం ఎకరాల్లో పంటలు వేసిన బడారైతులు మాత్రం కోట్ల రూపాయల వరకు సంపాదిం చేసుకున్నారు. పడమటి మండలాలలో మే,జూన్ నెలల్లో పంటదిగుబడి సాధించిన రెగ్యులర్ పంట కాపు రైతులు కూడా లక్షల్లో ఆదాయాలు చూశారు. ఎన్నో ఏళ్ళు నష్టపోయిన తమకు మొన్నటి ఆదాయం గతంలో నష్టాలను భర్తీచేసిందని, అంతకంటే తమకు మిగిలిందేమీ లేదని వారంటున్నారు. ఇంతలా టెక్కు ప్రదర్శించిన టమోటా ధరలు సాధారణ మార్కెట్లో ఇపుడు కిలో రూ.15కు పడిపోయాయి. మే,జూన్ నెలల్లో 15 కిలోల ధర మార్కెట్ యార్డుల్లో రూ.900 నుంచి 1100వరకు పలకగా, ఇపుడు పదిహేను కిలోల ధర కనిష్టంగా రూ.94,గరిష్టంగా 107వరకు పలికుతోంది.

## మండపాల్లో కొలువైన బొజ్జ గణపయ్యలు

కుప్పంరూరల్, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త



ప్రథమ పూజలు అందుకునే విఘ్నాలు తొలగించే శ్రీ వినాయకస్వామి చవితి పండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా యువత కుప్పం పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వినాయక విగ్రహాలను సుందరంగా ముస్తాబు చేసిన మండపాల్లో ప్రతిష్ఠించారు. ఈసందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు. కుప్పం పట్టణంలో వివిధ చోట్ల ఆకర్షణీయమైన వినాయకుడి విగ్రహాలను ప్రతిష్ఠించారు. కొత్తపేటలో అగరబత్తీలతో వినాయక విగ్రహం ప్రతిష్ఠించారు. రోజూ వినాయక మండపాల వద్ద ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు చేపడుతున్నారు.

## కొనసాగుతున్న తెదేపా నేతల నిరసన దీక్షలు

### - చంద్రబాబు అరెస్ట్‌పై ప్రజాభిప్రాయ సేకరణ

కుప్పం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త



తెదేపా అధినేత చంద్రబాబునాయుడు అరెస్ట్‌కు నిరసనగా కుప్పంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు చేపట్టిన రిలే నిరసన దీక్షలు కొనసాగాయి. వినాయక చవితి పండగ రోజు స్వామివారి విగ్రహంకు ప్రత్యేక పూజలు చేసి చంద్రబాబుకు త్వరగా బెయిల్ రావాలని, ఆయన ఆరోగ్యంగా ఉండాలని దేశం శ్రేణులు పూజలు చేశారు. మంగళవారం సైతం పార్టీ కార్యాలయ సమీపంలో నిరసన దీక్షలకు పెద్ద ఎత్తున నేతలు, తెలుగుయువత, మహిళ విభాగం నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈసందర్భంగా మాజీ మంత్రి పరసా రత్నం, ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, పరిశీలకుడు గాజుల ఖాదర్ బాషా, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు మాట్లాడుతూ చంద్రబాబు అరెస్ట్ అన్యాయమన్నారు. కేవలం కుట్రతోనే చంద్రబాబును అక్రమంగా జైలుకు తరలించారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలే వైకాపాకు గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. అనంతరం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. కార్యక్రమాల్లో నేతలు ఆంజనేయరెడ్డి, మునస్వామి, ఆర్ముగం, చెక్కునత్తం మణి, అన్సర్, వెంకటేష్, జయరాంనాయుడు, అనసూయ, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రిని కలసిన ఎమ్మెల్సీ భరత్ దంపతులు

కుప్పం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త



తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ భరత్, ఆయన సతీమణి దుర్గా పద్మినిలు సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కలసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అంతకుముందు రేణిగుంట ఎయిర్‌పోర్ట్‌లో సిఎంకు ఎమ్మెల్సీ భరత్ ఘనస్వాగతం పలకగా సిఎం జగన్ కుప్పంలో తాజా రాజకీయ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. కుప్పంలో జరుగుతున్న అభివృద్ధి పనులను సిఎంకు వివరించారు.

## ఉద్యమాలపై ఉక్కుపాదం మోపడం తగదు

### - తెలుగుదేశం పార్టీ నేతలు ధ్వజం



చిత్తూరుటౌన్, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు అరెస్టుపై నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్న తెలుగుదేశం నాయకులపై పోలీసులు ఉక్కుపాదంతో అణచి వేస్తున్నారని, ఇది ఏ మాత్రం తగదని తెలుగుదేశం నాయకులు ధ్వజమెత్తారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జిల్లా తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ మంగళవారం మాట్లాడుతూ పోలీసులు తెలుగుదేశం నాయకులను వేధిస్తున్నారని, గృహ నిర్బంధాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పౌరుల ప్రాథమిక హక్కులను కాలరాస్తూ పోలీసులు ఇబ్బందులు పెడ్తున్నారన్నారు. నిరసన దీక్షలకు సైతం ప్రైవేటు స్థలాల్లో చేసుకోవాలని పోలీసులు చెప్పడం అన్యాయన్నారు. ఈ సమావేశంలో దేశం నాయకులు సప్తగిరి ప్రసాద్, వెంకటేష్‌యాదవ్, ధరణిప్రకాష్, మధుకుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## తొలి పూజలందుకొని కాపాడు గణపయ్యా...!

### -మిన్నంటిన ఉత్సవాలు



చౌడేపల్లి, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త

తొలిపూజలందుకొని కాపాడు గణపయ్యా...అంటూ భక్తులు ప్రణవిల్లారు. వినాయక చతుర్థి సందర్భంగా మండల వ్యాప్తంగా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ప్రతి గ్రామంలోనూ యువతీ, యువకులు వినాయకుని విగ్రహాలను నెలకొల్పి విశేష పూజలు చేసారు. మృత్యుంజయేశ్వరస్వామి, షిర్డీసాయిబాబా ఆలయం, పాతబస్టాండు, నేతాజీనగర్, రామస్వామి మందిరం, బజారువీధి, గాంధీవీధి తదితర ప్రాంతాల్లో యువత వివిధ రూపాలతో వున్న వినాయకుని విగ్రహాలను పోటీలు పడిమరీ నెలకొల్పారు. ఆయా విగ్రహాల వద్ద సాంస్కృతిక, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. శెట్టిపేటలోని మోక్షగణపతి ఆలయంలో రాత్రంతా జాగారణ వుండి స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఏడు గ్రామాల్లో ఊరేగించారు.

## అత్యాచారానికి పాల్పడ్డ వ్యక్తికి రిమాండ్

రొంపిచర్ల, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త



అత్యాచారం కేసులో పట్టబడ్డ నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు కల్లూరు సిఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన కథనం మేరకు...సదుం బ్రాహ్మణవీధికి చెందిన ముస్లిం మహిళ(39) ఆదివారం సదుం నుంచి రొంపిచర్లకు వచ్చి తిరిగి రాత్రి 7గంటల సమయంలో పీలేరుకు ఆటోలో బయలుదేరింది. పెద్దగొట్టిగళ్ళు పంచాయతీ బోనంవారిపల్లికి చెందిన ఆటో డ్రైవర్ గుర్రప్ప(45) ఆటోలో మహిళ ఒక్కటే వుందని గ్రహించి బండకిందపల్లి-బోనంవారిపల్లికి మద్యలోవున్న చెరువులోకి తీసుకెళ్ళి అత్యాచారం చేసాడు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, నిందితుడిని బండకిందపల్లి సమీపంలో మంగళవారం ఉదయం అరెస్టు చేసి ఆటోను సీజ్ చేశామనీ, కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి గుర్రప్పను రిమాండ్‌కు ఆదేశించినట్లు సిఐ వివరించారు. ఎస్ఐ కృష్ణయ్య, ఎఎస్ఐ తులసీరామ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్‌ఆర్‌సి అధ్యక్షుడు అంజప్పచే మొక్కలు నాటే కార్యక్రమం

పెద్దపంజాణి, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త

మండలంలోని నిడిగుంట జడ్పీ హైస్కూల్ ప్రహరీగోడ, పలమనేరు - నిడిగుంట మార్గంలో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటేందుకు ఎన్‌హెచ్‌ఆర్‌సి అధ్యక్షుడు అంజప్ప ముందుకు వచ్చారు. తన సొంత ఖర్చులతో ఆయన సుమారు ఐదువందల మొక్కలు నాటించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

## కుప్పం రూరల్ సిఐగా ఈశ్వర్‌రెడ్డి నియామకం

కుప్పం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త

కుప్పం రూరల్ సిఐగా ఈశ్వర్‌రెడ్డిని నియమిస్తూ అనంతపురం రేంజ డిఐజి అమ్మిరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. కుప్పం రూరల్ సిఐగా పనిచేస్తున్న రియాజ్ అహ్మద్‌ను చిత్తూరు విఆర్‌కు బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీకు రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. కాగా కుప్పం రూరల్ సిఐగా నియమితులైన ఈశ్వర్‌రెడ్డి నేడో, రేపో బాధ్యతలు చేపట్టనున్నారని తెలిసింది.

## బ్రహోత్సవాలలో ప్రతిరోజూ భక్తులకు అన్నప్రసాదం



పుంగనూరు, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త : తిరుమల తిరుపతి దేవస్థానముల బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుపతిలోని ప్రధాన ఆలయాల వద్ద నిత్యం భక్తులకు అన్నప్రసాద వితరణకు గోవింద సేవామండలి సంకల్పించిందని సంఘ ఛైర్మన్ భూపాల్‌నాయుడు తెలిపారు. తొలిరోజున అలిపిరి వద్ద గోశాల పెద్దత్తున కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తిరుమల తిరుపతి పుణ్యక్షేత్రాల అధిపతి అయిన శ్రీవేంకటేశ్వరస్వామివారికి బ్రహ్మోత్సవాల కాలంలో దేశంలోని భక్తులే కాకుండా స్వామిని వివిధ రూపాలలో దర్శించుకోడానికి సకలలోకాలనుంచి దేవతలు వస్తారన్నారు. వారందరూ మానుషరూపంలోనే దర్శనంచేసుకుంటారన్నారు. దేవతా స్వరూపాలైన భక్తుల ఆకలిదప్పులు తీర్చడానికి ఏటా బ్రహోత్సవాల సమయంలో నిత్యఅన్న ప్రసాద వితరణలు వివిధ ఆలయాల వద్దచేస్తుంటామన్నారు. ఈసందర్భంగా వేలాది మంది భక్తులకు వితరణ జరిగింది. సంఘస్తులు పాలడుగు చంద్రమౌళి, ఓటేరి కృష్ణయ్య, గులిపాటిరజనీకాంత్‌నాయుడు, యోగా ప్రభాకర్, గుర్రం రెడ్డెప్పయాదవ్‌లను సత్కరించారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## 'దేశం' దీక్షలకు జనసేన మద్దతు

చిత్తూరుటౌన్, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త:



తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు అరెస్టుపై గత వారం రోజులుగా నిరసన దీక్షలు చేస్తున్న తెలుగుదేశం నాయకులకు జనసేన నాయకులు మద్దతు తెలిపారు. చిత్తూరులో 'దేశం' అధినేత నారా చంద్రబాబునాయుడు రిమాండ్‌ను నిరసిస్తూ కొంగారెడ్డి పల్లిలో మంగళవారం తెలుగుదేశం నాయకులు కాజూరు బాజాజీ, కాజూరు రాజేష్, మాజీ కార్పొరేటర్లు కందా, మోహన్‌రాజ్ తదితరులు నిరసన దీక్షలకు పూనుకొన్నారు. ఈ దీక్షలకు హాజరైన చిత్తూరు నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ దయారాం తెలుగుదేశం నాయకుల దీక్షలకు మద్దతు తెలిపారు. దీక్షలకు మద్దతు తెలిపిన వారిలో జనసేన నాయకులు దేవినేని యశ్వంత్, భానుప్రసాద్, లోకేష్ తదితరులు వున్నారు.

## జనసేనకు గ్లాసు గుర్తు కేటాయింపుపై హర్షం

చిత్తూరుటౌన్, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: జనసేన పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం గ్లాసు గుర్తును కేటాయించడంపై జనసేన చిత్తూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దయారాం, నాయకులు దేవినేని యశ్వంత్, భానుప్రసాద్ తదితరులు హర్షం తెలిపారు. కొందరు వైకాపా నాయకులు జనసేన గ్లాసు గుర్తుపై ప్రజల్లో అపోహలు సృష్టించారని వారు ఆరోపించారు. పార్టీకి గ్లాసు గుర్తు కేటాయించడంతో ప్రత్యర్థల విమర్శలకు అడ్డుకట్ట పడిందన్నారు.

## చంద్రబాబుపై కుట్రతోనే కేసుల బనాయింపు

### - కుప్పం పరిశీలకుడు ఖాదర్ బాషా

కుప్పం, సెప్టెంబ...



తెదేపా అధినేత చంద్రబాబునాయుడుపై కుట్ర... పంపారని కుప్పం టిడిపి పరిశీలకుడు గాజుల ఖాద... అరెస్ట్‌కు నిరసనగా మైనార్టీ నేతలచే కలసి మసీదుల... ఆయన మాట్లాడుతూ కుటుంబం కన్నా ప్రజలే తన... చంద్రబాబునాయుడు అన్నారు. సిఎం జగన్ కుట్రను... జగన్ అని ఆరోపించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు కోట్ల ... నింపుకున్నారని వారి అవినీతిని బయటపెట్టి కక్కిస్తామన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కాపాడుకోవాలంటే చంద్రబాబు అవసరం ఎంతో ఉందన్నారు. 16నెలలు జైల్లో ఉన్న వ్యక్తి చంద్రబాబును ఒక్కరోజైనా జైలులో ఉంచాలని చేశారన్నారు. కార్యక్రమంలో మైనార్టీ టిడిపి నేతలు సర్దార్ బాషా, అన్సర్ బాషా, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా వినాయకచవితి వేడుకలు



బంగారుపాళ్యం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: బంగారుపాళ్యం మండల పరిసర గ్రామాల్లో సోమవారం ఘనంగా వినాయకచవితి వేడుకలను ప్రజలు జరుపుకొన్నారు. ప్రతి గ్రామంలో వినాయకుడి మండపాలు ఏర్పాటు చేసి వినాయక ప్రతిమలు వుంచి పూజలు నిర్వహించారు. బంగారుపాళ్యంలోని ఓటికే వీధి, బ్రహ్మణవీధి, పోస్టాఫీసు వీధి, హరిజనవాడ, తగ్గువారిపల్లి నందు ప్రత్యేకంగా వినాయకుల ప్రతిమలు ఏర్పాటు చేశారు. ఉదయం నుండి భక్తులు స్వామి వారిని దర్శించుకొన్నారు. అధిక సంఖ్యలో యువత ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

## 40 మద్యం బాటిల్ స్వాధీనం.. కేసు నమోదు

వెదురుకుప్పం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త :

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు చేసి కేసు నమోదు చేసిన్నట్లు ఎస్ఐ రమేష్ బాబు మంగళవారం తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి .... మండలంలోని బలిజమొండి వెంగనపల్లెకు చెందిన ధనశేఖర్ చిల్లర దుకాణం వద్ద మద్యం బాటిల్స్ విక్రయించుతుండగా పట్టుకున్నట్లు చెప్పారు. అతని వద్దగల 40 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసిన్నట్లు చెప్పారు. ధనశేఖర్‌కు రిమాండు ఆదేశించిన్నట్లు తెలిపారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## పార్టీకి చేస్తున్న సేవలకు ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డిని అభినందించిన సీఎం

వెంకటగిరి, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త:



వెంకటగిరి నియోజకవర్గ పరిశీలకులు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పార్టీకి చేస్తున్న సేవలను విషయంలో సీఎం జగన్మోహన్‌రెడ్డి అభినందించారు. తిరుపతిలో రామసేతు ప్రారంభోత్సవానికి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కలిశారు. కుప్పంలో నిర్వహించిన థాంక్యూ సీఎం సార్ కార్యక్రమం, అలాగే ఇటీవల నెల్లూరులో నిర్వహించిన విద్యా సదస్సు రెండు కార్యక్రమాలు విజయవంతం కావడంపై సీఎం జగన్మోహన్‌రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని అభినందించారు. భవిష్యత్తులో పార్టీ బలోపేతం దిశగా పని చేయాలని చంద్రశేఖర్‌రెడ్డికి సూచించారు. ఇంకా పలు అంశాలపై చర్చించారు. అనంతరం సీఎం వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు.

## మద్యం దుకాణం తోలగింపుపై అధికారులు హామీ

కోట, 19 ప్రభాతవార్త

కోటలోని దాదాయి గుంట వద్ద తెదేపా చెందిన ఓ నాయకుడు అద్దె భవనంను ఊరిగికి దూరంగా తరలించాలని స్దానిక మహిళలు పలు సార్లు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. అయిన అధికారులు పట్టించుకోలేదు. ఈక్రమంలో రాష్ట్ర వైకాపా జాయింట్ సెక్రటిరి నల్లపరెడ్డిని ఆప్రాంత మహిళలు కలిసి ఇళ్ల మద్య ఉన్న మద్యం దుకాణంను తోలగించాలని కోరారు. దీంతో ఆయన స్పందించి రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి నారాయణ స్వామి తిరుపతి ఎంపి గురుమూర్తి దృష్టికి ఈ సమస్యను తీసెకేళ్లారు. ఆమేరకు మద్యం దుకాణంను అక్టోబర్ 2 తేదిలోపల అక్కడ నుంచి తరలిస్తామని ఎక్సైజ్ అధికారులు వినోద్ రెడ్డికి హామీ ఇచ్చారు. ఈక్రమంలో వినోద్ రెడ్డి మాట్లాడుతూ ఎక్సైజ్‌శాఖ మంత్రి, నారాయణస్వామికి, ఎంపి గరుమూర్తి లకు ముందుగా ధన్యవాదములు తెలిపారు. తమ ప్రాంత సమస్యను పరిష్కరించనున్న వినోద్ రెడ్డికి స్దానిక మహిళలు కృతజ్ఞతులు తెలిపారు.

## ప్రజాస్వామ్యాన్ని వైకాపా అపహాస్యం చేస్తోంది

### తెదేపా కార్యదర్శి తూపిలి రాధకృష్ణారెడ్డి

కోట, సెప్టెంబరు 19 ప్రభాతవార్త



కోటలో వెలిసిన శ్రీ వీరాంజనేయ స్వామి ఆశీస్సులతో మాజీ సిఎం చంద్రబాబు నాయుడకు పూర్వ వైభవం వస్తుందని తిరుపతి జిల్లా తెదేపా కార్యదర్శి తూపిలి రాధకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం కోటలోని అంజనీయస్వామి ఆలయంలో చంద్రబాబు నాయుడు జైల్ నుంచి విడుదల కావాలని స్వామి వారి ఆలయంలో తెదేపా నాయకులు ప్రతేక్య పూజలు నిర్వహించారు. ఈసందర్బంగా తూపిలి రాధకృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సంపూర్ణ మద్య నిషేదం విధిస్తానని ప్రజలను నమ్మబలికి అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్ రెడ్డి కల్తీ మద్యాన్ని అమ్మి వారి ప్రాణాలు తీస్తున్నారని ఆయన విమర్శఇంచారు. మద్యం కంపెనీల నుంచి తాడేపల్లె ప్యాలీస్‌కు వేల కోట్ల డబ్బు అక్రమ అందుతుందని దుయ్యబట్టారు. మద్యం విషయంలో వైకాపా అవినీతికి పాల్పడుతోందనాన్నరు. ప్రమాదకరమైన రసాయనాలతో మద్యం తయారు చేస్తున్నారని రూ 15 లీటర్ మద్యం తయారు చేసి వందల రూపాయలకు అమ్మతున్నారని విమర్శంచారు. ప్రజలకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆదుంతోందన్నారు. ప్రజలు చనిపోతున్నా ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. ఈ ప్రభుత్వం ప్రజా స్వామ్యాన్ని అపహాస్యం చేస్తుందన్నారు. సీమెన్స్ మాజీ ఎండీ అన్ని అనుమానాలు నివృత్తి చేశారన్నారు. వైకాపా నేతలు మాత్రం కళ్లు ఉండి కూడా వాటిని చూడలేకపోతున్నారని ఆరోపించారు. ప్రతి ఒక్కరూ చంద్రబాబు నాయుడు వెంటే ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు, వాకా విజయభాస్కర్ రెడ్డి, సర్వోత్తమ్ రెడ్డి, కె.మదుయాదవ్, ఎంపిటిసిలు, డి.సురేష్, షంసద్దీన్, మైనార్టీఇ సెల్ నాయకులు మస్తాన్ బాష, తెలుగు యువత అధ్యక్షుడు నందమోహన్, మాజీ సర్పంచ్ పురిణి శ్రీనివాసులు, ఎల్లసరి కృష్ణయ్య, కందల బాలయ్య మర్రి అనిల్, పల్లెమ్ము వెంకటకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### - వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

బాలాయపల్లి, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త:

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా డక్కిలి మండలంలోని లింగసముద్రం హరిజనవాడ, పాత హరిజనవాడ, గిరిజన కాలనీ, ఎగువ లింగసముద్రం మెయిన్‌లో పర్యటిస్తున్న వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి గ్రామస్థులు బ్రహ్మరథం పట్టారు. జగనన్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందుతున్నాయా అంటూ గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. దుష్ట చతుష్టయం ఎన్ని ఆరోపణలు చేసినా 2024లో జగనన్నకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. లింగసముద్రం సచివాలయంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విచ్చేసిన వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి గజమాలతో ఘన



స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జగనన్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ అలాగే ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని అర్హత ఉండి పథకాలు అందని లబ్దిదారులకు వెంటనే పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అదధికారులకు ఆదేశించారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

## చెంచురెడ్డి జ్ఞాపకార్ధంతో అన్నదానం కార్యక్రమం

చిల్లకూరు, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త



మండలంలోని బల్లవోలు గ్రామంలో వినాయక చవితి వేడుకలను పురస్కరించుకుని రెండవ రోజు దువ్వూరు చెంచురెడ్డి జ్ఞాపకార్ధంతో అతని కుమారుడు దువ్వూరు కిరణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వినాయకునికి విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా పార్టీ సీనియర్ నాయకుడు, గ్రామ పెద్ద మారంరెడ్డి అమర్నాథ రెడ్డి చేతులు మీదుగా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. వారితో పాటు సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, మారంరెడ్డి అభిమానులు , బల్లవోలు విఘ్నేశ్వర యూత్ పాల్గొన్నారు.

## వాడవాడలా ఘనంగా వినాయకచవితి సంబరాలు



కోట, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త

కోట మండలంలోని పలు గ్రామాల్లో గణనాథులు కొలువుతీరారు. కోట, చెందోడు, గూడలి, ప్రకాశం కాలనీ, జరుగుమల్లి, కొత్తపాలెం, అగ్రహారం, కొత్తపట్నం, సిద్ధవరం, అల్లంపాడు, ఊనుగుంటపాలెం, చిట్టేడు, చంద్రశేఖరపురం, కేశవరం, మద్దాలి, రామాపురం, రాఘువాపురం తదితర గ్రామాల్లో వినాయకుని విగ్రహాలకు ప్రజలు పూజలు చేశారు. కోటలో మాజీ ఎంపిపి నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డిని పలువురు నిర్వాహకులు స్వాగతం పలికి ఆహ్వానించారు. శాలువాలతో సత్కరించారు. తన పట్ల ప్రజలు చూపిన ఆదరాభిమానాల పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. కోటలో యువ నాయకుడైన మంగాపురం రమేష్‌బాబుకు యువత ఘనస్వాగతం పలికారు. రమేష్‌బాబు వినాయక విగ్రహానికి టెంకాయలు కొట్టి పూజలు చేశారు. చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

## చిత్తూరులో రెండు రోజుల చవితి

చిత్తూరుటౌన్, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: జిల్లా కేంద్రం చిత్తూరులో ఎన్నడు లేని విధంగా రెండు రోజుల పాటు వినాయక చవితి పండుగ నిర్వహించారు. చిత్తూరు నగర పరిధిలో ఇటు తెలుగు వారితో పాటు తమిళులు అత్యధికంగా నివసిస్తున్నారు. తెలుగు సాంప్రదాయాలను పాటించే తెలుగు ప్రజలు సోమవారం వినాయక చవితి పండుగను ఘనంగా చేసుకొన్నారు. అయితే తమిళ కల్చర్ అత్యధికంగా వుండే ప్రాంతాల్లో మంగళవారం ప్రత్యేకంగా వినాయక చవితి పండుగను నిర్వహించారు. ఇదిలా వుండగా చిత్తూరు నగర పరిధిలోని పలు ప్రాంతాల్లో వినాయక చవితి విగ్రహాలను వివిధ రూపాల్లో ఏర్పాటు చేశారు. కట్టమంచి రోడ్డులో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి 500 రూపాయల నోట్లతో మాలలు వేశారు. అలాగే దొడ్డిపల్లిలో గ్లోబు మోస్తున్న వినాయకుడి విగ్రహాన్ని నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

## పోలేరమ్మ జాతర నిర్వహణపై సీఎంకు వివరించిన రామ్‌కుమార్‌రెడ్డి



వెంకటగిరి, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త: అక్టోబర్ నెల 4, 5 తేదీల్లో జరగబోవు వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర మొట్టమొదటిసారిగా రాష్ట్ర పండుగ చేస్తున్న ఏర్పాట్లపై సీఎం జగన్మోహన్‌రెడ్డితో వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి వివరించారు. పోలేరమ్మ జాతర వెంకటగిరి ప్రాంతాలలో ప్రసిద్ధి చెందిందని సీఎంకు తెలిపారు. జాతరను రాష్ట్ర పండుగ చేసినందుకు అందరూ అభినందిస్తున్నట్లు సీఎం జగన్‌కు రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గం అభివృద్ధి, జిల్లా రాజకీయాలపై సీఎంతో చర్చించారు. జిల్లాకు వచ్చిన సందర్భంగా సీఎంకు ఘనంగా స్వాగతం పలికారు. సీఎం పర్యటనలో పాల్గొన్నారు.

## టీడీపీని ఎదుర్కోలేకనే చంద్రబాబుపై అక్రమ కేసు

### - మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ



వెంకటగిరి, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీని ఎదుర్కోలేక మాజీ సీఎం చంద్రబాబునాయుడుపై వైసీపీ ప్రభుత్వం అక్రమ కేసు పెట్టిందని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆరోపించారు. చంద్రబాబునాయుడుపై అక్రమ కేసు పెట్టి జైలుకు పంపినందుకు నిరసనగా తెలుగుదేశం వారు చేస్తున్న నిరాహార దీక్షలకు మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం జరగకపోయినా జరిగినట్లు అబద్ధపు కేసులు చంద్రబాబునాయుడుపై పెట్టినట్లు తెలిపారు. నీతి నిజాయితీకి మారుపేరు చంద్రబాబునాయుడు కుటుంబం అని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ వలన ఎంతో మంది నిరుద్యోగులు ఉద్యోగాలు సంపాదించినట్లు తెలిపారు. ప్రజలకు మేలు చేసేది తెలుగుదేశం పార్టీ అని చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో అవినీతి తప్ప అభివృద్ధి లేదన్నారు. 2024 సంవత్సరంలో వైసీపీ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి మరలా జైలుకు వెళతారని తెలిపారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

## తవణంపల్లెలో ఘనంగా వినాయకచవితి వేడుకలు

తవణంపల్లె, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: వినాయకచవితి పండుగ పర్వదినాన్ని మండల ప్రజలు సోమవారం అత్యంత భక్తిశ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్బంగా మండలంలో గ్రామ గ్రామాన, వీధుల్లో విఘ్ననాయకుడైన గణనాధుని ప్రతిమలను ప్రతిష్టించి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

### ఐరాలలో...

ఐరాల, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: వినాయకచవితి పండుగను సోమవారం మండల ప్రజలు అత్యంత భక్తి శ్రద్దలతో వైభవంగా నిర్వహించుకున్నారు. మండలంలోని వాడవాడలా వినాయకుని విగ్రహాలను ప్రతిష్టించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. మండపాలను అలంకరించి స్వామివారికి పలు రకాల ఫల, పత్రాలను సమర్పించి పూజలు చేశారు

# తిరుపతి డివిజన్

## తిరుమలకు జగన్ భార్యతో... రోజా తన భర్తతో ఎందుకు రారు?

**-జనసేన తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కిరణ్‌రాయల్ సూటి ప్రశ్న**



తిరుపతి(విద్య) సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: జగన్ సిఎం అయిన ఈ నాలుగు సంవత్సరాల 4 నెలల కాలంలో తన భార్యతో,అలాగే ఎమ్మెల్యే, మంత్రి అయిన రోజా తన భర్తతో ఎందుకు తిరుమల శ్రీవారి దర్శనానికి రారని జనసేన తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కిరణ్‌రాయల్ సూటిగా ప్రశ్నించారు.మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ నిన్నటి రోజున శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించడానికి శ్రీవారి ఆలయంలోకి వచ్చినప్పుడు అర్చకులు సిఎంకు తలపాగా కట్టే సమయంలో చిన్న పిల్లలు యూనిఫాం వేసుకున్నట్లు అమాయకంగా నటించారు.కానీ రాష్ట్రంలో రక్తపాతం సృష్టించిన ఈయన నిజస్వరూపం 5 కోట్ల మంది ప్రజలకు తెలుసని,అంత స్వాతిముత్యం కమల్‌హాసన్‌లాగా నటించాల్సిన అవసరం లేదని ఎద్దేవా చేశారు.మాజీ మంత్రి అయిన కొడాలి నానికి ఆలయ మహద్వారం గుండా ఆలయంలోకి ప్రవేశం లేనప్పటికీ,ఆయన ఏ అధికారిక హోదాలో వెళ్లాడని మండిపడ్డారు. తిరుమల-తిరుపతి జగన్ టూర్ అనేది ఒక సర్కస్ వాతావరణంలో జరిగిందని ఆయన ఎద్దేవా చేశారు.ఈ సమావేశంలో టిడిపి నేత ఆర్సీ.మునికృష్ణ,జనసైనికులు హేమకుమార్, రాజేష్ ఆచారి, రమేష్ నాయుడు, గుట్టా నాగరాజు,వంశీ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబుని విడుదల చేయాలని గంగమ్మకు పొంగళ్లు



వడమాలపేట, సెప్టెంబరు 19 ప్రభాతవార్త: చంద్రబాబునాయుడుని విడుదల చేయాలని వడమాలపేట గంగమ్మకు తెలుగు మహిళలు మంగళవారం పొంగళ్లు పెట్టి వేడుకున్నారు. చంద్రబాబు నాయుడుని అక్రమంగా అరెస్టు చేసిన జగన్ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి లక్ష్మీప్రసన్న, వడమాలపేట మండల ప్రధాన కార్యదర్శి హేమావతి, తెలుగు మహిళా అధ్యక్షురాలు ధనలక్ష్మి, నాయకులు గురునాథంశెట్టి, రాధాకృష్ణ, మురళీరెడ్డి, నరసయ్య, మహిళలు పాల్గొన్నారు.

## వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్ జట్లు ఎంపిక



వడమాలపేట, సెప్టెంబరు 19 ప్రభాతవార్త: నియోజకవర్గ స్థాయిలో వాలీ బాల్, బాల్ బ్యాడ్మింటన్ అండర్-14,17 బాల, బాలికల జట్లు ఎంపిక చేసినట్లు క్రీడల సమాఖ్య కార్యదర్శి సురేష్ తెలిపారు. మంగళవారం వడమాలపేట హైస్కూలు క్రీడా మైదానంలో జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నగరి నియోజకవర్గ స్థాయి వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్ అండర్-14,17 బాల బాలికల ఎంపికకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక అవుతారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు పద్మావతి, తులసిరాం, పీడీలు చంద్రశేఖర్‌రాజు, గుర్రప్ప, నందకుమార్, మణి, మోహన్‌లు పాల్గొన్నారు.

## జ్ఞాన సిద్ది వినాయకునికి హోమాలు,అభిషేకాలు



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 19 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలోని గాంధీ వీధిలో వెలసిన జ్ఞాన సిద్ది వినాయకుని ఆలయంలో మంగళవారం భారీ ఎత్తున హోమాలు,అభిషేకాలు నిర్వహించారు. ఈ ఏడాది రెండు రోజుల పాటు వినాయక చవితి ఘడియలు ఉండటంతో మంగళవారం నిర్వాహకులు ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేసారు.ఈ కార్యక్రమాలకు శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్బంగా శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో పండగలంటే ప్రత్యేకత ఉందన్నారు. కార్యక్రమాల్లో జలకం కిషోర్,కొళ్ళూరు హరినాధ్ నాయుడు, మొగరాల గణేష్, మధు, కొళ్ళూరు జయ,కుప్పయ్య, సుబ్బయ్య, బుగ్గ ప్రసాద్, పత్తి జగన్నాధం, సునీల్ హరి తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు అన్నదానం



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 19 ప్రభాతవార్త : శ్రీకాళహస్తిపట్టణంలోని గాంధీవీధిలో వెలసిన జ్ఞాన వినాయక ఆలయంలో జరుగుతున్న చవితి సంబరాల్లో భాగంగా మంగళవారం వార్డుకు చెందిన యువకులు అన్నదానం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిధిగా జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వినూత కోట హాజరయ్యారు. ఈ కార్యక్రమాలను తోట గణేష్,పేట చిరంజీవి, పేట చంద్రశేఖర్, దినేష్, ఉదయ్‌కుమార్ తదితరులు హాజరయ్యారు. కార్యక్రమాల్లో నాయకులతో పాటు పత్తి హరి, నాగేంద్ర, ట్రైలర్,బాబు, ప్రేమ్, రఘు, శ్రీనివాసులు, గురవయ్య, సుబ్బు, చైతన్యలు పాల్గొని సహకరించారు.

## వైభవంగా వినాయక చవితి వేడుకలు



నగరి, సెప్టెంబరు 19 ప్రభాతవార్త: నియోజకవర్గపరిధిలో వినాయకచవితి వేడుకలు సోమవారం వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి పట్టణంలో పండుగ సందడి కనిపించింది. పలువురు మట్టితో చేసిన వినాయకుని ప్రతిమలను ఇళ్ళకు తీసుకెళ్లారు. ప్రధాన రహదారి మొత్తం పూజాసామగ్రి విక్రయాల, కొనుగోలు దారులో ప్రధాన రహదారి కిక్కిరిసింది. నగరి మున్సిపల్ పరిధిలో చావడి ప్రాంతంలోని, బస్టాండ్ ప్రాంగణంలో, ఓంశక్తి ఆలయం సమీపం, బైపాస్ రోడ్డు, పద్మావతి నగర్, కొత్తపేట, సత్రవాడ, ఏకాంబరకుప్పం, కేవీపీఆర్ పేట, బస్టాండ్ ప్రాంగణంలోను అతి పెద్ద వినాయకుని ప్రతిమలు ఏర్పాటుచేయగా భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలుచేసుకున్నారు. పట్టణ, మండల పరిధిలోని విఘ్నేశ్వర ఆలయాలు భక్తులతోకిక్కిరిసింది. ఆలయాల వద్ద భక్తులకు అన్నదానం చేశారు.

**భక్తిశ్రద్ధలతో విఘ్నేశ్వరుని పూజించిన మంత్రి రోజా:**

వినాయక చవితిని మంత్రి రోజా వైభవంగా నిర్వహించారు. సోమవారం నివాసం ఆవరణలో ఉన్న వినాయకునికి పూజలు నిర్వహించడంతోపాటు మట్టి వినాయక ప్రతిమను సుందరంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో శాస్త్రోక్తంగా ఆమెపూజలు నిర్వహించారు.

## ఏపీలో నిరంకుశ పాలన సాగుతోంది:గాలి భానుప్రకాష్



నగరి, సెప్టెంబరు 19 ప్రభాతవార్త: ఏపీలో నిరంకుశ పాలన సాగుతోందని, ఎలాంటి ఆధారాలు లేకుండా కేవలం రాజకీయ కక్షతో, తాను 16 నెలలు జైలులో ఉన్నానని చెప్పి జగన్మోహన్‌రెడ్డి అందరికి అవినీతి బురద అంటించాలని చేసిన అక్రమ అరెస్టును ప్రతి ఒక్కరు ఖండిస్తున్నామని నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ తెలిపారు. నగరిలో రాష్ట్రం, దేశం, ప్రపంచం మొత్తం ఈ రోజు బాబుతో మేమున్నాం అంటూ అండగా ఉన్నామని దీక్షలు, ర్యాలీలు నిర్వహించారు. సైకో ప్రభుత్వానికి టైం దగ్గర పడిందని, వీళ్ళను తొందరలోనే ఇంటికి పంపించి సైకిల్ ప్రభుతత్వాన్ని తెచ్చుకోవడానికి ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారన్నారు. అలాగే టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు రావిళ్ళ మాధవనాయుడు ఆధ్వర్యంలో బాబుకి తోడుగా ఒక నియంతపై పోరాటం కోసం మేము సైతం తెలుగుదేశం పార్టీ రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో నగరి మున్సిపాలిటీ అధ్యక్షుడు రమేష్‌బాబు, వడమాలపేట మండల అధ్యక్షుడు జానా వెంకటయ్య, పుత్తూరు రూరల్ అధ్యక్షుడు రవికుమార్, రాష్ట్ర టీఎన్‌టీ యూసీ సెక్రటరీ బాలాజీ, చిత్తూరు పార్లమెంట్ అధికారి ప్రతినిధి ధనంజ యనాయుడు, చిత్తూరు పార్లమెంట్ టీఎన్‌టీయూసీ అధికార ప్రతినిధులు జ్యోతినాయుడు, జిల్లా కార్యదర్శి రొక్కం బాలాజీ, మోహన్‌బాబు, టీఎన్‌టీయూసీ సెక్రటరీలు దాము, బాలకృష్ణ, చిత్తూరు పార్లమెంట్ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి లక్ష్మీప్రసన్న, నియోజకవర్గ టీఎన్‌టీయూసీ కార్యదర్శి కుమార్, మీడియా కో-ఆర్డినేటర్ నాగేంద్ర, మహిళ్యా సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ రజని, నగరి మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసన్, వడమాలపేట ప్రధాన కార్యదర్శి హేమావతి, పుత్తూరు మహిళా ప్రధాన కార్యదర్శి మోహన్, సీనియర్ నాయకులు నారాయణస్వామి, అశోక్, ఢిల్లీ, కన్నయ్య, సైదలి, చిట్టి, రమేష్, దొరస్వామి, పెద్దబ్బరాజు, ఉమాపతి రావు, అంజయ్య, వెంకటేశ్వరరావు, శేషాద్రి యాదవ్, కరుణ, మదివన్నన్, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

## త్యాగరాజ మండపంలో ఆకట్టుకున్న లలిత సంగీత కచేరి



తిరుపతి (క్రీడ), సెప్టెంబర్ 19 ప్రభాతవార్త:తిరుమల శ్రీ వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా టిటిడి తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో ప్రతి రోజు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసింది. మంగళవారం ఉదయం ప్రముఖ గాయకులు డాక్టర్ ఆమూరి సుబ్రమణ్యం, శ్రీవారిపై ఆలపించిన భక్తి గేయాలు, భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కలియుగ వైకుంఠ వాసుని వైభవాన్ని అతి మధురంగా గానం చేసిన ఆమోది బాలసుబ్రమణ్యం రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీచర్ తిరుమలయ్య, టి. సుబ్రమణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా గాయకులు ఆమూరి సుబ్రమణ్యం, గాత్రానికి తబలాపై మునిరాజ్ కీబోర్డ్ పై యువరాజ్ సంగీత సహకారం అందించారు.

## ఎస్ఎస్ఆర్ 2024 వెరిఫికేషన్ పక్కాగా నిర్వహించాం:జేసి

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: ఎస్ఎస్ఆర్ 2024 వెరిఫికేషన్‌ను పక్కాగా నిర్వహించామని జాయింట్ కలెక్టర్ డికె బాలాజీ పేర్కొన్నారు. మంగళవారం 2024 ప్రత్యేక ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ పై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లా కలెక్టర్లతో, జేసిలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించగా జిల్లా కలెక్టర్ నుండి జేసి, ఇఆర్‌ఓలు, అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ పెంచల కిషోర్, నగర పాలక కమిషనర్ హరిత, ఆర్డీవోలు కనకనరసారెడ్డి, కిరణ్ కుమార్, చంద్రముని, రామారావు, ఎస్‌డిసిలు శ్రీనివాసులు, కోదండరామి రెడ్డి, ఎన్నికల తహశీల్దార్ సురేష్, ఇడిటిలు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనాన్ని సమిష్టిగా విజయవంతం చేద్దాం

**-వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ సభ్యులు**



తిరుపతి రవాణా, సెప్టెంబర్ 19 ప్రభాత వార్త : వినాయక నిమజ్జనాన్ని సమిష్టిగా విజయవంతం చేద్దామని వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం స్థానిక కమిటీ కార్యాలయంలో కన్వీనర్ సామంచి శ్రీనివాస్ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నవీన్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నవీన్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తిరుపతి ఆధ్యాత్మిక నగరంలో ఒకే సారి తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు, వినాయకచవితి పండుగలతో నగరంలోని ప్రతి ఇంటా ప్రతి వీధి పండుగ వాతావరణంలో పచ్చటి తోరణాలతో భక్తి పాటలతోఆధ్యాత్మిక శోభ సంతరించుకుందన్నారు. వినాయక సాగర్ వద్ద నిమజ్జనం సమయంలో చెరువు సమీపంలోకి చిన్న పిల్లలను పంపకుండా నిర్వాహకులు తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

## మట్టి విగ్రహాలను పూజిద్దాం..పర్యావరణాన్ని కాపాడుకుందాం!

**-నగర ప్రజలకు హోటల్స్ అసోసియేషన్ పిలుపు**




తిరుపతి(విద్య) సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: వినియక చవితి పండుగను పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను పూజిద్దామని,తద్వారా పర్యావరణాన్ని కాపాడుకుందామని హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.ఆర్. స్వామి, తిరుపతి అధ్యక్షుడు వీరాంజ నేయులు (చిల్లీస్ అంజి) నగర ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చూడటానికి అందంగా ఉంటాయనే ఉద్దేశ్యంతో రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలను వాడటం వల్ల భవిష్యత్ తరాలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో తిరుపతి హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు,రాష్ట్ర తిరుపతి నేతలు,స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఔషధ రంగంలో నానో టెక్నాలజీ కీలకం

**-జెఎన్‌టియు విసి ప్రొఫెసర్ రంగరాజన్**




రామచంద్రాపురం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: ఔషధ రంగంలో నానో టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తుందని జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రంగరాజన్ అన్నారు. మంగళవారం వెంకట్రామాపురంలోని సెవెన్‌హిల్స్ ఫార్మశీ కళాశాలలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెల్, సెవెన్‌హిల్స్ కళాశాల సంయుక్తంగా నానో టెక్నాలజీపై 5 రోజుల శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ టెక్నాలజీతో దెబ్బతిన్న కణజాలను పునరుత్పత్తి వేగంగా చేయవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిరంజన్ బాబు, కరస్పాండెంట్ యం.సుమలత, ప్రొఫెసర్లు డాక్టర్ గోపాల్, డాక్టర్ రంగనాయకులు, డాక్టర్ పద్మావతీ, తదితరులు పాల్గొన్నారు.

## పెద్దకన్నలిలో వేడుకగా వినాయకచవితి వేడకలు

**వినాయకుని లడ్డు వేలం ధర రూ.84వేలు**



తొట్టంబేడు, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త : మండలంలోని పెద్దకన్నలి గ్రామంలో వినాయకచవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. యువత పెద్దసంఖ్యలో ఉట్టికొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం వినాయకపూజలు నిర్వహించి గ్రామోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం వినాయకునికి ప్రత్యేకంగా తయారుచేసిన లడ్డూను వేలంపాట నిర్వహించారు. ఈలడ్డును గ్రామానికి చెందిన చిన్నగురవారెడ్డి రూ.84వేలతో అత్యధికంగా వేలంపాట పాడి లడ్డును దక్కించుకున్నారు. వేడుకల్లో గ్రామ పెదనదలు, యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చంద్రబాబు విడుదల కావాలని పూజలు



తొట్టంబేడు, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త : తెలుగేదశం పార్టీ జాతీయ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు నుంచి త్వరగా విడుదల కావాలని, ఆయన ఆరోగ్యం బాగుండాలని వారి కుటుంబానికి మనోధైర్యాన్ని ఇవ్వాలని కోరుతూ తిరుపతి పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు చక్రాల ఉష ఆధ్వర్యంలో స్వర్ణముఖినదీ తీరం వద్ద ఉన్న అర్ధనారీశ్వ రాలయంలో వెలసిన స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు తెలుగుమహిళలు పాల్గొన్నారు.

## పండుగపూట కూడా తెదేపా నాయకులు హౌస్ అరెస్టు



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త : పండుగపూట కూడా ప్రతిపక్ష నాయకుల హక్కులను వైకాపా ప్రభుత్వం కాలరాస్తోందని తెలుగుదేశంపార్టీ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్ తెలిపారు. ఈసందర్భంగా వైకాపా ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకుని పాలన సాగిస్తోందని ప్రతిపక్షాల హక్కులను కాలరాస్తోందన్నారు. గత నాలుగున్నర సంవత్సరాల్లో పరదాల మాటన పరిపాలన సాగించినటువంటి వైఎస్‌జగన్‌రెడ్డి ఇదే తరహాలో శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించే దుస్థితి ఏర్పడిందన్నారు. అంతేకాకుండా తెలుగుదేశంపార్టీ నాయకులను, మహిళలను వారి వారి ఇంటి వద్దే హౌస్‌అరెస్టుచేశారు.

## మిథున్‌రెడ్డి జాత్యాహంకారం నశించాలి...తెదేపా



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 19 ప్రభాత వార్త : రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలకు చెందిన వారు రాజకీయ, సామాజిక మరియు ఆర్థికంగా ఎదగడం గిట్టని వైసిపి నాయకుల దురుసుతనం రాష్ట్రం దాటి దేశ రాజధాని చేరి నిండు లోక్‌సభలో బిసి వర్గానికి చెందిన తెలుగుదేశంపార్టీ శ్రీకాకుళం లోక్‌సభ సభ్యులు రామ్మోహన్ నాయుడును సభ్యసమాజం తలదించుకునేలా ఏకవచన సంబోధనతో అవమానించిన రాజంపేట ఎంపి మిధున్‌రెడ్డి జాత్యాంహార దోరణి నశించాలని తెలుగుదేశం పార్టీ బిసి విభాగ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మునిరాజయాదవ్ పిలుపునిచ్చారు. బిసి వర్గానికి చెందిన తోటి సభ్యుడైనా రామమోహన్‌నాయుడిని అగ్రవర్ణ అహంకారంతో దుర్భాషలాడిన మిధున్‌రెడ్డి బిసి వర్గాలకు మరియు ఎంపి రామోహన్‌నాయుడికి తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఉమేష్‌రావు, మిన్నల్‌రవి, భాస్కర్, మణి, వంశీ, గోపియాదవ్, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు నిర్ధోషిగా బయటకు రావాలని : తెలుగు మహిళలు మొక్కులు



చంద్రగిరి, సెప్టెంబర్19 ప్రభాతవార్త: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్ధోషిగా, కడిగిన ముత్యంలా బయటకు రావాలని ఆకాంక్షిస్తూ చిత్తూరు పార్లమెంటరి అధికార ప్రతినిధి హేమలత ఆంజనేయస్వామి ఆలయంలో మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం శ్రీవారి మెట్టు సమీపంలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం వద్ద తెలుగు మహిళలతో కలిసి కొబ్బరికాయలు కొట్టి, చంద్రబాబు నిర్ధోషిగా బయటకు రావాలని స్వామిని కోరుకున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయం, అరాచకపాలనకు ఎదురొడ్డి పోరాడుతున్న చంద్రబాబును కక్ష సాధింపులో భాగంగా అన్యాయంగా జైల్లో పెట్టారని ఆవేదన వ్యక్త చేసారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళలు శశిరేఖ, వెంకటలక్ష్మీ, బాదూరు సుగుణ, బుజ్జమ్మ, ప్రమీల, నాగమ్మలు పాల్గొన్నారు.

## గొప్ప నాయకుడిని కోల్పోయాం: వైసీపీ నేతలు



రేణిగుంట, సెప్టెంబరు 19 ప్రభాతవార్త: వైసీపీ సీనియర్ ముస్లింమైనారిటీ నాయకుడు కో-ఆప్షన్ మెంబరు సుభాన్‌రాజా మంగళవారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, వైసీపీ మండల ఇన్‌చార్జి పవిత్రరెడ్డి, ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.సానుభూతి తెలిపిన వారిలో వైసీపీ నేతలు దయాకర్‌రెడ్డి, యోగీశ్వర్‌రెడ్డి, హై కోర్టు అడ్వకేట్ పేరూరు మునిరెడ్డి, ధనంజయరెడ్డి, శశికిరణ్, నాగ సుబ్రహ్మణ్యంరెడ్డి, సందీప్‌రెడ్డి, లక్ష్మిపతిరెడ్డి, మోహన్, మహ్మద్ రసూల్, అడ్వకేట్ పురుషోత్తం రెడ్డి, అబ్దుల్ ఖదీర్, నాగేషం, షబ్బీర్ అహ్మద్, మునిశేఖర్‌రెడ్డి, మన్యం శ్రీనివాసులురెడ్డి, రహీం, రఫీ ఉల్లా, షఫీ ఉల్లా, ఇరానీ ఖాదిర్, రాజేష్‌రెడ్డి, సైకిల్ షాపు అలీ, గోల్డ్ మాబా, మస్తాన్, రామ్మోహన్‌స్వామి, కృష్ణమూర్తి, ఇన్నానాధన్, సుజాత, అరుణాదేవి తదితరులు ఉన్నారు.

## పంచాయతీ కార్మికులకు క్యారియర్ల పంపిణీ

రేణిగుంట, సెప్టెంబరు 19 ప్రభాతవార్త: రేణిగుంట తూకివాకం పంచాయతీ కార్మికులకు హెల్త్ మురళి తన తండ్రి అంకం నాగరాజు ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకుని 175 టిఫిన్ క్యారియర్లు స్థానిక పంచాయతీ కార్యాలయాల్లో సర్పంచ్‌నాగేషం సమక్షంలో మంగళవారంపంపిణీ చేశారు. వీటితోపాటు వారికి చికెన్ బిర్యానీ అందజేశారు. పేదల కళ్ళలో కనిపించే ఆనందంలో తన తండ్రి జీవించి ఉంటారని మురళి తెలిపారు. కార్యక్రమంలో మురళిసతీమణి విజయలక్ష్మి, కుమారులు సాయి సుమంత్, చేతన్ సాయి, సోదరుడు రమణ, పంచాయతీ వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

## ప్రధాని మోదీ ఫోటో ఎగ్జిబిషన్



సత్యవేడు, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త : నియోజకవర్గ కేంద్రమైన సత్యవేడులో మంగళవారం బీజేపి మండల అధ్యక్షుడు గెడి మునిత్రాప్ ఆధ్వర్యంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెట్టి అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ ఫోటో ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈకార్యక్రమ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మునిశేఖర్ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ దేశాభివృద్ధిని కాంక్షిస్తూ వేసిన అడుగులు రాజకీయాల్లో ఓటమి ఎరుగని నాయకుడిగా తీర్చిదిద్దాయన్నారు. ఈకార్యక్రమంలో ఎస్సీ మోర్చా తిరుపతి జిల్లా అధ్యక్షుడు మునికృష్ణయ్య, నాయకులు మోహన్‌బాబు, చెంచయ్య, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ బీమా సాయం అందజేత



నగరి, సెప్టెంబరు 19 ప్రభాతవార్త: పట్టణ పరిధిలోని పాత భజన గుడి వీధికి చెందిన మంగళవారం వైఎస్ఆర్ బీమా సాయాన్ని కౌన్సిలర్లు దయానిధి, గోపాల్‌రెడ్డి, మునికృష్ణారెడ్డి అందజేశారు. బాషా భార్య ఎస్.ఖమర్(48) ఇటీవల మృతి చెందారు. ఆమె వైఎస్ఆర్ బీమా మంజూరు కావడంతో మంగళవారం రూ.10వేలు బాధిత కుటుంబానికి నగదు రూపంలో అందజేశారు. మిగిలిన మొత్తం రూ.90 వేలు వారి ఖాతాకు జమ అవుతుందని సచివాలయ అడ్మిన్ భాస్కర్ తెలిపారు. సచివాలయ సిబ్బంది, వైద్యసిబ్బంది, వలంటీరు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు

నగరి, సెప్టెంబరు 19 ప్రభాతవార్త: జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లోనగరి మున్సిపల్ పరిధి పుదుపేట జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఏ.శరణ్య, ఎం.డి.శ్యామ్ ప్రతిభ కనబరచారు. ఈ నెల 16వ తేదీ ఓజోన్ పొరను కాపాడుకోవడం, వాతావరణంను రక్షించుకోవడం అనే అంశంపై తిరుపతి సైన్స్ సెంటర్‌లో సింపోజియం, క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను, గైడ్ టీచర్ బి.శశిరేఖను ప్రధానోపాధ్యాయులు టి.వి.రమేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

## వాడవాడలా గణేష్ వేడుకలు



పుత్తూరురూరల్, సెప్టెంబరు 19 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణం, మండల పరిధిలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో మంగళవారం వినాయక చవితి సందర్భంగా గణేష్ వేడుకలు వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని పలు వీధుల్లో కూడలి ప్రాంతాల్లో వినాయక స్వామి మండపాలు ఏర్పాటు చేసి అందులో స్వామివారిని ప్రత్యేకపుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. గేటు పుత్తూరు, పుత్తూరు పట్టణంలో గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం గణేష్ మండపాలు అధికంగా ఏర్పాటు చేశారు. వినాయకస్వామి ఆలయాల్లో మండపాల్లో భక్తులకు కిటకిట లాడింది. భక్తులు స్వామివారికి కర్పూర హారతులు ఇచ్చి పూజలు చేశారు.



